# మొక్కుబడి

రాజారావు హృదయం పరవశించి, అమితానందంతో పరవళ్ళు తొక్కుతోంది. తన్మయత్వంతో చేతులు జోడించి దేవుని విగ్రహం ముందు వినమ్రుడై నిలుచున్నాడు.

"స్వామీ, ఇన్నాళ్ళకి నా మొక్కుబడి చెల్లించుకోగలుగుతున్నాను! నా ఆలస్యానికి మన్నించు. ఈ అధముడి మీద కోపగించుకోకు స్వామీ" అంటూ హుండీలో ఐదు వంద రూపాయల కాగితాలు వేసి వెనుతిరిగాడు.

ఇప్పుడు అతని మనస్సు తేలికగా ఉంది. తలపైనుంచి ఏదో భారాన్ని దించుకొన్నట్టు అనిపిస్తోంది. తన ఇష్టదైవానికి ఆపదసమయంలో మొక్కిన మొక్కు ఇన్నేళ్ళుగా చెల్లించ లేకపోయినందుకు ఏదో తప్పుచేసిన వానిలా బాధపడేవాడు. "ఇప్పటికి ఆ స్వామి దయతో చూశాడు. మొక్కు తీర్చుకునే వీలు కల్పించాడు." అనుకుంటూ రాజారావు తిరుగు ప్రయాణం కట్టేడు.

రాజారావు మూడు పదుల జీవితంలో దేవునికి మొక్కుకోవటం ఇదే మొదటిసారి. అసలు అతనికి ఇలాంటివి అంటే నమ్మకం లేదు. కాని... నాలుగేళ్ల క్రితం అతని చెల్లెలి పెళ్లికని ఒక స్నేహితుని దగ్గర ఐదువేలు అప్పు చేశాడు. తను అడగగానే మిత్రుడు లేదనకుండా అప్పు ఇచ్చినందుకు అతని మనసు ఆ స్నేహితునిపట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. ఆ పైకం చూస్తుంటే కొండంత బలం వచ్చింది. మిత్రుని పుణ్యమా అని దొరికిన ఈ డబ్బు తండ్రి చేతుల్లో పెడితే నాన్న ఎంత సంతోషిస్తాడో! ఇంటికి రాగానే తన మిత్రుని గురించి భార్యకు సగర్వంగా చెప్తూ జేబులో చెయ్యి పెట్టాడు. మరుక్షణం అతని గుండె ఆగినంత పనయింది.

"పర్స్! పర్స్ ఎక్కడో జార్చేసాను" వెర్రికేక పెట్టేడు.

అతని అర్ధాంగి కూడా కంగారు పడింది.

"ఆఫీసులోనే మర్చిపోయేరేమో వెళ్ళి చూడండి" సలహా ఇచ్చింది.

రాజారావుకి కరచరణాలు ఆడలేదు. అతనికి ఆ డబ్బు దొరుకుతుందనే నమ్మకం ఏమాత్రం లేదు. దాదాపుగా బావురుమన్నాడు.

"మరీ అంత అధైర్యపడితే ఎలా? మన స్ఫూర్తిగా దేవునికి మొక్కుకోండి. మన డబ్బు మనకి తప్పక దొరుకుతుంది" రాణి భర్తకు ధైర్యం చెప్పింది.

ఆ మాటలమీద విశ్వాసం కలగలేదు రాజారావుకి. పోగొట్టుకున్న సొమ్ము తిరిగి దొరకటమా? ఈ పాటికే ఎవరి చేతుల్లోనోపడి ఉంటుంది. డబ్బెవరికి చేదు? తిరిగి రాదు గాక రాదు. అయినా

రాణి చెప్పినట్టు మొక్కుకుంటే తన డబ్బు తనకు దొరికితే మంచిదేగదా అనుకుని ఆ గదిలో అమర్చి ఉన్న దేవుని పటానికి నమస్కరించాడు. "పోగొట్టుకున్న నా సొమ్ము దొరికితే నీ హుండీలో ఐదు వందలు వేస్తా"నని మొక్కుకున్నాడు: భార్య బట్టీ పెట్టించిన ప్రకారం.

అతను పూజా మందిరంలో నుంచి బైటకి వచ్చేసరికి సుధాకర్ ప్రత్యక్షం అయ్యాడు. సుధాకర్‌దీ రాజారావుదీ ఒకే ఆఫీసులో ఇద్దరివీ ఎదురెదురు సీట్లు.

"అరె రాజా! పర్సు మర్చిపోయావు. ఐదు వేలుంది. ఎవరైనా చూస్తే ఏమై ఉండేది? నీ అదృష్టవశాత్తు నా కళ్లబడింది" అని ఆ పర్సును రాజారావు చేతికి అందించాడు.

రాజారావు మనస్సు ఆశ్చర్యంతో, భక్తితో నిండిపోయింది. సుధాకర్‌కి థాంక్స్ చెప్పాలని కూడా తోచలేదు. అతనికి సుధాకర్ మంచితనం మీదకంటే భగవంతునిపట్ల విశ్వాసమే అధికమైపోయింది. తను భక్తితో మొక్కుకోగానే తన డబ్బు తన కళ్లపడింది. అంటే భగవంతుడే తనకి సహాయపడ్డాడు. ఆలా ఆలోచిస్తూ... సుధాకర్ తన ఎదుట ఉన్న సంగతే మరచిపోయాడు.

రాణిమాత్రం సుధాకర్‌లోని మానవత్వాన్ని మెచ్చుకుంది. అతని నిజాయితీని, స్నేహ హృదయాన్ని ప్రశంసించి కమ్మని కాఫీ ఫలహారాల్తో కృతజ్ఞతలు తెల్పుకుంది.

అతను వెళ్ళిపోయాక, "సుధాకర్‌గారు చాలా మంచివారండీ, ఈ రోజుల్లో చేతికందిన డబ్బు ఎవరు తెచ్చి ఇస్తారు? అతని నిజాయితీ గొప్పది!" అంది భర్తతో.

రాజారావు ఆమె మాటలు పట్టించుకోలేదు. " భగవంతునికి మొక్కాం గదా! అందుకే మన డబ్బు మనకొచ్చింది" అన్నాడు నిర్లిప్తంగా.

భర్త తీరు రాణికి ఆశ్చర్యాన్ని కలిగించింది. దేవుణ్ణి విశ్వసించని భర్తకు ఈ ఒక్క సంఘటనతోనే భగవంతునిపట్ల ఎంత గురి కుదిరిందీ అనుకుంది.

రాజారావు తన ఆరాధ్యదైవాన్ని ఎప్పుడు చూడగల్గుతానా, ఎప్పుడెప్పుడు మొక్కుబడి తీర్చుకుంటానా- అని ఆరాటపడేవాడు కానీ. ఆ స్వామిని చేరుకోవటానికీ తన మొక్కు చెల్లించు కోవటానికీ సరిపడా డబ్బు సమకూర్చుకొనేసరికి బాగా లేటయింది.

రాజారావు తన ఊరికి తిరిగి వచ్చినా కొండపై నిండుగా కొలువున్న ఆ స్వామి దివ్యసుందర రూపమే అతని కళ్లల్లో కదలాడుతూ ఉంది. ఆ స్వామి సన్నిధిలో పొందిన పారవశ్యంలోంచి ఇంకా తేరుకోలేకపోతున్నాడు. అంతగా అతని మనస్సు దైవంలో నిమగ్నమవటానికి కారణం తాను మొక్కుకోగానే పోగొట్టుకున్న పైకం దొరకటమే.

కానీ ఆ మరునాడు తెల్లవారుతూనే పేపర్లో చూసిన వార్త నమ్మలేకపోయాడు. ఆ వార్త మళ్లీ మళ్లీ చదువుకున్నాడు. తను ముడుపు చెల్లించి వచ్చిన రాత్రే ఆ కోవెలలో స్వామి నగలు, భక్తులు హుండీలో వేసిన డబ్బు, వెండి, బంగారాలు అన్నీ దోచుకుపోయారుట ఆరితేరిన బందిపోట్లు.... అదీ ఆ వార్త సారాంశం.

రాజారావు నిలువునా కంపించిపోయాడు. అతని మనస్సంతా అల్లకల్లోలమైపోయింది. "స్వామి! పోగొట్టుకున్న నా డబ్బు నాకిప్పించి నా చేత మొక్కుబడి చెల్లించుకున్నావే! నిన్ను నిలువుదోపిడి చేస్తుంటే, వేలాది భక్తులు నీకు అర్పించుకున్న కానుకలు అపహరిస్తూంటే అలా చూస్తూ కూర్చున్నావా? మరిప్పుడు నీ మొక్కుబడి ఎవరికి?" కన్నార్పకుండా ఆ స్వామి వారి పటం వంకే చూస్తూ అనుకున్నాడు రాజారావు.

●

('చతుర' మాసపత్రిక - నవంబరు 97)